# ముహూర్త బలం



సింహాద్రి నాయుడికి అతని బావమర్ది అప్పలనాయుడికి కూడా అధికార పార్టీ టిక్కెట్లు వచ్చాయి ఎన్నికలలో పోటీ చెయ్యడానికి.

ఇదరివీ ప్రక్క ప్రక్క నియోజక వర్గాలే.

సింహాద్రి నాయుడు డాషింగ్ నేచర్ కలవాడు. అతనికి మూఢ నమ్మకాలంటే నమ్మకం లేదు. మనిషికి అసాధ్యమనేది లేదనీ. పట్టుదలతో సాధించవచ్చుననీ తరచుగా అంటూ వుంటాడు.

అందుకే ఎందరు బంధువులు. మిత్రులు వద్దని చెప్తున్నా వినకుండా అమావాస్యనాడువెళ్ళి రిటర్నింగ్ ఆఫీసర్ వద్ద నామినేషన్ దాఖలు చేసి వచ్చాడు.

"అయ్యో! వీడి అసాధ్యం కూలా! అదృష్టవశాతు అధికార పార్టీ టిక్కెట్టు వస్తే అమావాస్యనాడు నామినేషన్ వేస్తాడా పొగరు కాకపోతే. వెంటనే లెంపలు వాయించుకుని తిరుపతి వెళ్ళి గుండు చేయించుకుని ఏడుకొండలవాడి దయ పొందమని" పోరు పెట్టసాగారు.

"తమిళులకు అమావాస్య మంచిది. వాళ్ళు పెళ్ళిళ్ళుకూడా అమావాస్యనాడే చేసుకుంటారు. దానికేమంటారు? అంతా మూఢనమ్మకం కాకపోతే?" అని వెటకారం చేశాడు సింహాద్రి నాయుడు.

"పోనీలే జరిగిందేదో జరిగింది. ఇప్పు డెళ్ళి గుండు చేయించుకుంటే ఎలక్షన్ కూడా తిరుక్షవరం అవుతుందేమో!"అని కొందరు సందేహించారు.

సింహాద్రి నాయుడు మాత్రం నిమ్మకు నీరెత్తినట్లు ఎన్నికల ప్రచార కార్యక్రమంలో దిగిపోయాడు.

అప్పల నాయుడు మాత్రం దైవభక్తి పరాయణుడు. పెద్దలమీద గౌరవం గలవాడు కావడంవల్ల సింహాద్రి అప్పన్న దగ్గర్నుంచి అన్నవరం స్వామి వద్దకు వెళ్ళి, తర్వాత ద్వారకా తిరుమల. బెజవాడ కనకదుర్గ, మంగళగిరి పానకాల స్వామి. నెల్లూరు రంగనాయకులు. కాళహస్తీశ్వరుడూ· తిరుపతి వెంకన్న వరకూ పెద్ద పెద్దదేవుళ్ళందర్నీ దర్శించుకునితను గెలవగానే మళ్ళీ వస్తాననీ. కానుకలుసమర్పించుకుంటాననీ మొక్కుకుని వచ్చాడు.

"అదీ సంప్రదాయం అంటే" అని అశేష బంధు జనులు. మిత్రులు మెచ్చుకున్నారు అప్పల నాయుడిని.

దేశంలోనే పెద్ద జ్యోతిష్యులలో ఒకరుగా పరిగణింపబడుతున్న వెంకటశాస్త్రిలవారు గంటన్నరసేపు శాస్త్రాలన్నీ తిరగేసీ మరగేసీ దివ్యమైన ముహూర్తం నిర్ణయం చేశారు.

అప్పల నాయుడు నామినేషన్ వేసే రోజున ఉదయమే లేచి పూజలు పునస్కారాలు చేసి. కార్యకర్తలతో కారులో వూరేగుతూ వెళ్ళి సరిగ్గా ముహూర్తం గడియకు నామినేషన్ దాఖలు చేశాడు.

ఎన్నికల ఫలితాలు ప్రకటించారు.

సింహాద్రి నాయుడు గెలిచాడు.

అప్పల నాయుడు ఓడిపోయాడు.

ఇద్దరూ అధికార పార్టీ అభ్యర్థులే అయినా ఇలా ఎందుకు జరిగింది? అందులోనూ మరీ దారుణం ప్రక్క-ప్రక్క నియోజకవర్గాల్లోనే ఇంత ఘోరం జరగడం.

సింహాద్రినాయుడు హైదరాబాద్ చెక్కేశాడు.

మంత్రివర్గ నిర్మాణం పూర్తయిన తర్వాత స్వంత నియోజన వర్గానికి తిరిగి వచ్చాడు. కార్యకర్తలు. ప్రజలు. బంధువులు. మిత్రులు వూరి చివరనుంచీ వూరేగింపుగా వూళ్ళోకి తీసుకొచ్చారు.

అప్పల నాయుడు మాత్రం తన నామినేషన్‌కు దివ్యమైన ముహూర్తం పెట్టిన వెంకటశాస్త్రిని కలుసుకుని జరిగిందంతా చెప్పి —ఇలా ఎందుకు జరిగిందో చెప్పమన్నాడు. అసలు ఈ జ్యోతిషం అంతా బూటకం అని ఋజువైపోయిందన్నాడు. కోపంతో ఏదేదో అన్నాడు.

వెంకటశాస్త్రి చిరునవ్వు నవ్వి ఇలా అన్నాడు: "అప్పల నాయుడూ నువ్వు గెలవనంత మాత్రాన శాస్త్రాన్ని తిట్టినందువల్ల లాభంలేదు. నువ్వు దివ్యమైన ముహూర్తంలో నామినేషన్ వేశావుగనుక ఓడిపోయావు కొద్ది తేడాతో. లేకపోతే నీకు డిపాజిట్ దక్కి వుండేది కాదు"అన్నాడు.

అప్పల నాయుడు నోరెళ్ళబెట్టాడు.

"మరి మా బావ ఎలా గెలిచాడు? అమావాస్యనాడు నామినేషన్ వేశాడుగదా?" అన్నాడు.

"అదే అతను చేసిన పొరపాటు. నువ్వు వేసిన ముహూర్తం చూసుకుని వేసి వుంటే మంత్రి అయ్యేవాడు. పాపం ఎమ్మెల్యేగానే వుండిపోయాడుగదా!"అని పెదవి విరిచాడు వెంకటశాస్త్రి.

అప్పల నాయుడు సంతృప్తిపడినట్లు కనిపించాడు.


## వనితా జ్యోతి

## మహిళా పాఠకులకు సంతోషకరమైన వార్త!

'వనితాజ్యోతి' సచిత్ర మాసపత్రికలో ప్రముఖ సినీ తార శ్రీమతి లక్ష్మి అందాలూ, అలంకరణలుకు సంబంధించిన ప్రశ్నలకు సమాధానా లిస్తారని తెలియజేయడానికి సంతోషిస్తున్నాము.

మీ ప్రశ్నలను జులై 12వ తేదీలోగా 'లక్ష్మి ప్రశ్నావళి' C/o వనితాజ్యోతి సచిత్ర మాసపత్రిక, బాక్స్ నెం-712, ఆంధ్ర జ్యోతి బిల్డింగ్స్, విజయవాడ-10కి పంపించగోరుతున్నాము.

—ఎడిటర్